

పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలి
- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన, పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్ సమావేశమందిరంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఫొటో రోల్స్-2024పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చనిపోయిన ఓటర్ల వివరాలను ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాతనే జాబితా నుంచి తొలగించాలని, బదిలీ అయిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల పనులు జరగాలని, ఎక్కడా అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల పనితీరు పరిశీలించాలని, ఒకే ఇంటి నంబర్ పరిధిలో ఉండే ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లున్నట్లయితే ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండే బీఎల్‌వో, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటికి ఎంట్రీ, ఎగ్జిట్ వేర్వేరుగా ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీలో ఆలస్యం చేయవద్దన్నారు.కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఇంకా అవకాశముందని, వాటిని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో చనిపోయిన ఓటర్ల వివరాలను మున్సిపల్ రికార్డుల ఆధారంగా తొలగిస్తామన్నారు. ఫామ్-7 ద్వారా ఎవరైనా బదిలీ అయినా చనిపోయిన ఓటర్ల వివరాలను సమర్పించవచ్చని, వాటిని బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించుకున్న తర్వాతే చర్యలు తీసుకుంటామన్నారు. రెండు చోట్ల ఓటర్లుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని తొలగిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మికిరణ్, అరుణశ్రీ, డీఆర్వో పవన్ కుమార్, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

నేడు జడ్పీ సమావేశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో పవన్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'పురుమల్ల'కు షోకాజ్

- మూడురోజుల వ్యవధిలో జవాబు ఇవ్వాలని నోటీసు
- కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓటమికి ఆయనే కారణమని ఫిర్యాదులు
- లోపాయికారిగా విపక్షాలకు సహకరించాడని ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)



కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌కు ఆ పార్టీ అధిష్ఠానం షోకాజ్ నోటీస్ జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరి అనూహ్యంగా కరీంనగర్ అసెంబ్లీ టికెట్‌ను కైవసం చేసుకున్నారు. ఆయన ఎన్నికల్లో ఓడి పోయారు. ప్రచారంలో చురుకుగా పాల్గొనలేదని, పరోక్షంగా బీఆర్‌ఎస్, బీజేపీకి మద్దతు ఇచ్చారని, ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన నిధులను కూడా ఖర్చుచేయక పోవడంతోనే ఓడిపోయారని పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై టీపీసీసీ సీరియస్‌గా స్పందించింది.

పార్టీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి పురమల్ల శ్రీనివాస్‌కు మూడురోజుల వ్యవధిలోనే జవాబు ఇవ్వాలని, జవాబు ఇవ్వకపోతే ఎలాంటి సమాధానం లేదని భావించి పార్టీ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీసింది. ఎన్నికల సమయంలో ప్రచారంలో చురుకుగా పాల్గొనక పోవడమే కాకుండా ఏఐసీసీ నేతలు, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి పాల్గొన్న సమావేశాల నిర్వహణలో ఆయన విఫలమ య్యారని కాంగ్రెస్ జిల్లా నేతలు విమర్శించారు. నియోజకవర్గానికి చెందిన ఏఐసీసీ సమన్వయకర్తలు, పరిశీలకులు చేసిన సూచనలను పెడచెవినపెట్టి అసమర్థ, నిర్లక్ష్యధోరణులను అవలంబించారన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీతో కుమ్మక్కైన కారణంగానే కాంగ్రెస్ ఓటమి చెంది మూడోస్థానంలో నిలిచిందని పురమల్ల శ్రీనివాస్‌పై పార్టీనేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

పరస్పర ఫిర్యాదులు

దీనికంతటికి ఆయన స్వయంకృతాపరాధమే కారణమని తెలుస్తున్నది. తన ఓటమికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మెన్నేని రోహిత్‌రావు కారణమని శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ కమిటీ వారి నుంచి వివరణ కోరింది. వారు కమిటీ చైర్మన్ ముందు హాజరై కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓటమికి ఇవి కారణాలంటూ ఆధారాలతో సహా వివరించినట్లు తెలిసింది. ఆధారాలు బలంగా ఉండడంతో పార్టీ క్రమశిక్షణ సంఘం సీరియస్‌గా స్పందించి పురుమల్ల శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనికి ఆయన సమాధానం ఇవ్వలేక పోవచ్చని, ఆయనపై పార్టీ వేటు వేయడం ఖాయమని పార్టీవర్గాలు చర్చించుకుం టున్నాయి.

బీఆర్‌ఎస్‌లో ఉంటూ ఎన్నికల ముందే కాంగ్రెస్‌లో చేరిన శ్రీనివాస్‌కు టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేతలు, శ్రేణుల్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. ఎన్నికల సమయంలో కూడా ఆయన పార్టీ నేతలను కలుపుకొని సమన్వయంతో ప్రచారం నిర్వహించడంలో విఫలమైన నేపథ్యంలోనే పార్టీ ఓటమి పొందిందనే భావన వ్యక్తమైంది. నియోజకవర్గానికి నాలుగు వైపులా ఉన్న నాలుగు నియో జకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మధ్యలో ఉన్న కరీంనగర్‌లో మాత్రం బీఆర్‌ఎస్ విజయం సాధించి కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైందని, ఇందుకు అభ్యర్థి లోపాయికారి విధానాలే కారణ మని పార్టీనేతలు భావించడమే కాకుండా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు.

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ ఎంపీ టికెట్ కోసం కూడా దరఖాస్తు చేసుకోవడంపై పార్టీ శ్రేణులు తీవ్రంగా ఆక్షేపించాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీ అధికారంలోకి రాగా శ్రీనివాస్ తన వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకోవడానికి నియోజకవర్గ ఇన్‌చార్జిగా అధికారు లను కలుస్తూ వచ్చారని, పార్టీ నేతలకు ఎవరికీ అందుబాటులో లేరని విమర్శలు వస్తున్నాయి.

భూ కబ్జా కేసులతో ఇబ్బందులు

ఆయనపై బీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలోనే 30కిపైగా భూకబ్జా కేసులు నమోదయ్యాయని, ఇప్పుడు పోలీసులు భూకబ్జాలపై ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో ఏదో ఒక రోజు ఆయన అరెస్టు కావడం తప్పదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇప్పటి వరకు భూ కబ్జా కేసుల్లో బీఆర్‌ఎస్ నేతలు మాత్రమే అరెస్టు కాగా శ్రీనివాస్ అరెస్టు తప్పనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయాలన్నీ పార్టీ నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకవెళ్లారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాలు వచ్చాయని తెలిసింది. దీంతో పురమల్లపై వేటు తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రేపటి నుంచి మాఘమాసం

- సుముహూర్తాలు ప్రారంభం
- ఏప్రిల్ 9తో క్రోధి నామ సంవత్సరం
- చైత్రంలోనూ ముహూర్తాలే..

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 8: శూన్యమాసంగా చెప్పుకునే పుష్య మాసం శనివారంతో ముగియనుంది. ఇక శుభ ముహూర్తాల కాలం వచ్చింది. ఈ నెల 10వ తేదీ శనివారంతో మాఘమాసం ప్రారంభమవుతుంది. మాఘ మాసమే కాకుండా ఆ తర్వాత మార్చి 11వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఫాల్గుణ మాసంలో కూడా వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలున్నాయి. మార్గశిరం కంటే ముందు మాసాల్లో అంటే మంచి రోజుల్లో శుభ కార్యాలు చేయాలను కునేవారు ఆయా రంగాల వారికి అడ్వాన్సులు ఇచ్చి బుకింగ్ చేసుకున్నారు. శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో అన్నివర్గాల వారికి గిరాకీ పెరగనుంది. బ్యాండు మేళాలు, పురోహితులు, మంగళ వాయిద్యాలు, కేటరింగ్, వంట పనివారు, టెంట్ హౌస్‌లు, ఫంక్షన్ హాళ్లు, పెళ్లి పందిళ్ల అలంకరణలు, ఈవెంట్స్ మేనేజ్‌మెంట్ నిర్వాహ కులకు చేతినిండా పని దొరకనుంది. ఏప్రిల్ 8తో ఫాల్గుణ మాసం ముగియనుంది.

9వ తేదీ మంగళవారం ఉగాది పర్వదినంతో చైత్ర మాసం ప్రారంభమై క్రోధినామ తెలుగు నూతన సంవత్సరం జరుపుకోనున్నారు. ఏప్రిల్ 4వ తేదీ గురువారం వరకు శుభ ముహూరాలు ఉన్నాయి. ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రిల్ 17న శ్రీరామనవమి ఉంది. ఈ తొమ్మిది రోజులు ముహూర్తాలు లేవు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకు శుభ ముహూర్తాలున్నాయి. ఆ తర్వాత వైశాఖ మాసం (మే), జ్యేష్ఠ మాసం (జూన్) కలిపి రెండు నెలలు మూఢం ఉంది. మే, జూన్, జూలైలో ముహూర్తాలు లేవు. తర్వాత శ్రావణమాసంలో అంటే ఆగస్టు 8 నుంచి 28 వరకు శుభముహూర్తాలున్నాయి. ఆ తర్వాత వచ్చే కార్తీక, మార్గశిర మాసాలు (నవంబరు, డిసెంబరు) నెలల్లో ముహూర్తాలు న్నాయి. మూడు నెలలపాటు ముహూర్తాలు రావడంతో అందరిలో ఆనందం వెల్లి విరుస్తోంది. జిల్లా వ్యాప్తంగా శుభకార్యాల సందడి నెలకొననుంది.

● ఫిబ్రవరి, మార్చిలో పండగల వివరాలు

ఫిబ్రవరి 9న చొల్లంగి అమావాస్య, 14న వసంత పంచమి, 16న రథ సప్తమి, 20న భీష్మ ఏకాదశి, 24న వ్యాస పౌర్ణిమ, 28న సంకటహర చతుర్థి, మార్చిలో 8న మహా శివరాత్రి, 23న దక్షిణాదివారికి, 24న ఉత్తరాదివారికి కామ దహనం, 25న హోలీ, ఏప్రిల్ 9న క్రోధి నామ సంవత్సర తెలుగు ఉగాది.

విద్యుత్ సిబ్బందికి సహకరించండి

- 'గృహజ్యోతి' కోసం వివరాలు అందించండి
- ఎస్ఈ గంగాధర్



గణేశ్‌నగర్, ఫిబ్రవరి 8: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కోసం సర్వే నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఎస్ఈ గంగాధర్ ఓ ప్రకటనలో కోరారు. సిబ్బంది వచ్చినప్పుడు ప్రజా పాలన దరఖాస్తు రసీదు, ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) నంబర్, ఆధార్ కార్డు నంబర్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బంది వచ్చినపుడు అందుబాటులో లేకపోతే ఈ వివరాలను సమీపంలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలో లేదా విద్యుత్ సహాయ గణాంకాల అధికారి కార్యాలయంలో, విద్యుత్ బిల్లులు చెల్లించే కేంద్రంలో తెలియజేయాలని ఆయన సూచించారు.



ఇష్టారాజ్యంగా..

పేలుడు పదార్థాల వినియోగం

- గ్రానైట్ క్వారీల్లో మైన్స్, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు
- క్వారీ యజమాని అరెస్ట్‌తో కలకలం



నిబంధనలు పాటించపోతే కఠినంగా వ్యవహరిస్తాం అభిషేక్ మొహంతి, సీపీ

చట్టాన్ని ఉల్లంఘించే వారిపై, నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. గ్రానైట్ క్వారీల నిర్వాహకులు ఎక్స్‌ప్లోజివ్స్ యాక్టు నిబంధనలు పాటించాలి. పేలుడుపదార్థాలు వినియోగించేందుకు తప్పనిసరిగా లైసెన్స్‌ను తీసుకోవాలి. లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: జిల్లాలోని కొన్ని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదకరమైన పేలుడు పదార్థాల ను పోలీసు, గనులు, భూగర్భశాఖ నుంచి ఎలాంటి లైసెన్స్‌లు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. ఇటీవల కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొత్తపల్లి మండలం నాగుల మల్యాలలోని సంధ్య ఇంటర్నేషనల్ గ్రానైట్ క్వారీలో నిర్వహించిన తనిఖీల్లో పలు విషయాలు వెల్లడయ్యాయి. ఈ క్వారీలో పేలుడు పదార్థాలు వినియోగించేందుకు ఎలాంటి లైసెన్స్ తీసుకోలేదని, నిబంధనలకు విరుద్ధంగా ఈ క్వారీలో నిలువగా ఉంచిన 215 జిలెటిన్ స్టిక్స్, పేలుడుకు ఉపయోగించే 21 బెండల్స్ వైర్‌ను సీజ్ చేశారు.

ఎక్స్ ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్టు-1908 సెక్షన్ 3, 5 కింద కేసు నమోదు చేశారు. గ్రానైట్ క్వారీ యజమాని జలగం లింగారావుతోపాటు సూపర్‌వైజర్ రాజు, క్వారీ ఇన్‌చార్జి ప్రదీప్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇంత కాలంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా పేలుడు పదార్థాలను వినియోగించడం, నిల్వ చేసినా పోలీసులు, మైన్స్ అధికారులు గుర్తించలేదా.. అనేది ప్రశ్నగా మిగిలింది.

జిల్లాలో 316 గ్రానైట్ క్వారీలు

జిల్లాలో ప్రస్తుతం 316 గ్రానైట్ క్వారీలు, 24 స్టోన్ క్రషర్స్ నడుస్తున్నాయి. వీటన్నిటికీ నిత్యం పేలుడు పదార్థాలు అవసరం ఉంటాయి. పేలుడు పదార్థాలు అసాంఘిక శక్తులకు చేరితే ప్రమాదకరమని తెలిసి కూడా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పేలుడు పదార్థాలపై నిఘా కొర వడింది. 10 రోజులుగా కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, గనులు, భూగర్భ శాఖ అధికా రులు సంయుక్తంగా జిల్లాలోని గ్రానైట్ క్వారీలు, స్టోన్ క్రషర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఒక గ్రానైట్ క్వారీ యజమానిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడంతో గ్రానైట్ వ్యాపారులు అప్రమత్తమయ్యారు. వారి క్వారీ పరిధిలో ఉన్న పేలుడు పదార్థాలు ఇతర ప్రాంతాలకు తరలించినట్లు ప్రచారం జరుగుతున్నది.

నిబంధనలు పట్టించుకోకుండా..

గ్రానైట్ క్వారీలు, స్టోన్ క్రషర్లలో వినియోగించే పేలుడు పదార్థాలైన జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైర్, డిటోనేటర్స్, గన్ పౌడర్ వంటివి లైసెన్స్‌డ్ మ్యాగజైన్‌ల నుంచి లైసెన్స్ కలిగిన క్వారీలు, క్రషర్లకు సరఫరా చేయాల్సి ఉంటుది. ఎక్స్‌ప్లోజివ్స్ మ్యాగజైన్‌ల లో నిలువగా ఉంచి, అక్కడి నుంచి సరఫరా చేసే సమయంలో ఎంత కొనుగోలు చేశారు? ఎవ రెవరికి? ఏ మేరకు విక్రయించారు? సమయం, తేదీతో సహా రికార్డులు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ రికార్డులను పోలీసులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇంత పకడ్బందీగా నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకపోవడంతోచాలా సందర్భాల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పేలుడు పదార్థాలు పట్టుబడుతున్నాయి.

- 2022 ఫిబ్రవరి 19న బావుపేట నుంచి ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న 3,500 మీటర్ల కార్డెక్స్ వైర్‌ను గడ్చిరోలి పోలీసులు పట్టుకున్నారు. పది కార్టన్లలో ఈ వైర్‌ను తరలిస్తుండగా దామరంచ వద్ద పట్టుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఇందులో కరీంనగర్ శివారులోని బావుపేట ఎన్టీఆర్ తమిళ కాలనీకి చెందిన సల్ల రాజు గోపాల్, ఎండీ ఖాసీం సాదు ల్లాలు ఉన్నారు. బావు పేటలో గ్రానైట్ క్వారీలకు సరఫరా చేస్తున్న డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు ఛత్తీస్‌గఢ్, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
- 2021లో హుజూరాబాద్‌లో 10 బస్తాల గన్ పౌడర్‌ను కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సైదాపూర్ వద్ద అక్రమంగా ఉన్న జిలెటిన్ స్టిక్స్, వైర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని నిందితులను అరెస్టు చేశారు. అంతకు ముందు హుస్నాబాద్ ప్రాంతంలో వరదకాలువ సొరంగం పనుల్లో ఉపయోగిస్తున్న పేలుడు పదార్థాలను నక్సల్స్ సానుభూతిపరుడు ఒకరు అక్రమంగా తరలిస్తుం డగా పోలీసులు పట్టుకున్నారు. తిమ్మాపూర్ మం డలంలో ఏడాది కిందట డిటోనేటర్లతో వెళుతున్న కారును పోలీసులు పట్టుకున్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తాం

చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు డాక్టర్ అలగు వర్షిణి



సమావేశంలో మాట్లాడుతున్న అలగు వర్షిణి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: చేనేత కార్మికులకు వస్త్ర ఉత్పత్తిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ఉపాధి కల్పిస్తామని చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు డాక్టర్ అలగు వర్షిణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో టెస్కో వస్త్ర పీపీ ఆర్డర్లపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త రకాల వస్త్రాల రూపకల్పనపై ఆసక్తి ఉన్న చేనేత కార్మికులు వారి మగ్గాల వివరాలు ఇవ్వాలన్నారు. వారికి ఆయా వస్త్రాల ఉత్పత్తిలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. చిన్న చేనేత సహకార సంఘాలకు నూలు సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి టెస్కో ద్వారా ఆర్డర్లు పొంది కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కలెక్టర్ పమే లా సత్పతి మాట్లాడుతూ సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ఇవ్వడానికి, రుణ సదుపాయం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టెస్కో జనరల్ మేనేజర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు, ఉప సంచాలకులు వి అశోక్‌రావు, టెస్కో టెక్నికల్ ఆఫీసర్ హిమజ్ కుమార్, డీఎంవో వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకుడు ఎస్ చరణ్, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ జాతరకు ఏర్పాట్లు షురూ



అమ్మవార్ల గద్దెలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 8: సమ్మక్క, సారలమ్మ జాతరకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమ్మవార్ల గద్దెలు ముస్తాబు చేస్తున్నారు. గద్దెలతోపాటు క్యూ లైన్ పైపులకు, గోడలకు రంగులు వేస్తున్నారు. స్నానాల కోసం కాలువలు, జలాశయాల వద్ద మెట్లు, వంతెనలు నిర్మిస్తున్నారు. జాతర ప్రాంగణాలను శుద్ధి చేసి చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సేవలు, టోకెన్లు, ప్రసాద కౌంటర్లు, పార్కింగ్ వంటి శిబిరాల కోసం స్థలాలను ఎంపిక చేస్తున్నారు. జాతర తేదీలకు ముందు నుంచే భక్తుల తాకిడి ఉండే ప్రాంతాల్లో మరింత శ్రద్ధ కనబరుస్తున్నారు. జాతర కమిటీల ఎంపిక దాదాపు ముగియగా వివిధ వస్తువుల అమ్మకాల కోసం టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులతోపాటు జాతర కమిటీల బాధ్యులు పరిశీలిస్తున్నారు.



క్యూలైన్ల కోసం ఏర్పాట్లు

కుక్కల దాడిలో గొర్రెలు, కోళ్లు మృతి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో మేకలు, కోళ్లు మృతి చెందాయి. గురువారం తంగళ్లపల్లికి చెందిన పరకపల్లి తిరుపతికి చెందిన మేకల షెడ్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. అరు గొర్రెలు, 20 కోళ్లు మృతి చెందాయి. బాధిత తిరుపతి కుటుంబాన్ని ఎంపీపీ పడి గెల మానస రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు. బాధితుడికి ఎంపీటీసీ అంతయ్య రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి విషయాన్ని తీసు కెళ్లి బాధిత కుటుంబానికి సాయం అందేలా చూస్తామన్నారు.



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రమాదవశాత్తూ బావిలో పడిన యువకుడు

- మృతదేహం కోసం గాలింపు

శంకరపట్నం, ఫిబ్రవరి 8:మండలంలోని కరీంపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌గౌస్ (30) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఊరికి సమీపంలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో జారిపడే సమయంలో సమీపంలో ఉన్న ఓ రైతు ప్రత్యక్షంగా చూసినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. నీరు ఎక్కువగా ఉండడంతో అచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు.

దొంగ అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 : ఇటీవల నగరంలోని పలు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన రౌతు పవన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. పవన్ వద్ద ట్యాబ్, 2 సెల్‌ఫోన్లు, 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



వాసవీమాత ఆలయంలో పూజలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 8 : మల్లాపూర్ వాసవి మాత ఆలయంలో అమ్మ వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వాహకులు గురువారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ఆర్యవైశ్యులు, భక్తులు ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హల్దిప పీఠాధిపతి శ్రీవామా నాశ్రమ మహాస్వామిజీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, భక్తుల ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండ లాధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, మైలారపు లింబాద్రి, శివ రాంకిషన్, శివ శ్రీనివాస్, గాదె మనోహర్, సంగేమ్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: సంత్ సేవాలాల్ మహాజన్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక(లైవ్) అధ్యక్షుడు భూక్య నరేష్‌నాయక్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా దాదాపు మూడు కోట్లు, రాష్ట్రంలో దాదాపు 35లక్ష మంది గిరిజను లు(లంబాడీలు)ఉన్నారన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనా నికి వచ్చే వారిలో ఎక్కువ శాతం గిరిజనులు ఉంటారని, వారికి ఇబ్బం దులు కలగకుండా సదు పాయాలు కల్పించాలని, పాలక వర్గంలో గిరిజ నులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్ నాయక్, రమేష్‌నాయక్, రాజేష్‌నాయక్, గంగాధర్‌నాయక్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 10న నిర్వహిం చనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగంలో ఈ పోటీలను సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నామని జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి సిహెచ్ సంపత్‌రావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 25 కిలోల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీ లలో ప్రతిభ చాటే క్రీడాకారు లను మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

ఇల్లందకుంట ఆలయంలో వేలం పాటలు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 8: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు, పోగు చేసుకొనుటకు దేవాదాయ శాఖ డివిజన్ పరిశీ లకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహిం చారు. ఈ మేరకు పూజా సామగ్రి, కొబ్బరికాయలు ఒక సంవత్సరం పాటు అమ్ముకొనుటకు ఎనగంటి వెంకటేశ్వర్లు రూ.7,66,000 పాట, అదేవిధంగా కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు క్యాతం రాజయ్య రూ.1,60,000 పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. ఈ టెండర్ వీరికి ఒక సంవత్సరం ఉంటుందని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో కానిస్టేబుల్ రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 8: భార్య స్రవంతి ఆత్మహత్య కేసులో సిరిసిల్ల పట్టణం సర్దాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుల్, భర్త రాగుల నాగరాజు అనే కానిస్టేబుల్‌ను అరెస్ట్‌చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన నాగరాజు, స్రవంతి అలియాస్ లాస్య దంపతులు సిరిసిల్లలో ఉంటున్నారు. భార్య స్రవంతి మృతికి భర్త నాగరాజు, అత్తలే కారణమంటూ ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మృతురాలి అత్తను అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చిగురుమామిడి,ఫిబ్రవరి 8: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల లక్ష్మణ్(40) అనే గీత కార్మికుడు గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను తోటి గీత కార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు గౌడ సంఘం నాయకులు తాళ్లపెల్లి రాజయ్య తెలిపారు. పేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

● జమ్మికుంట మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 8: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. గురువారం వ్యవసాయ మార్కెట్‌కు 88మంది రైతులు 770క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాలు యార్డుకు సెలవు దినాలు, తిరిగి సోమవారం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కందుగుల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రైస్ మిల్‌లో సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన అప్పని రమేష్, వెలగందుల ప్రకాష్, ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తులు సదరు మిల్ యాజమానికి ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: జన్మదిన వేడుకల సందర్భంగా రోడ్‌పై న్యూసెన్స్ చేస్తుండగా వారించిన వ్యక్తిపై బీరుసీసాతో దాడి చేసిన కేసులో ఆరుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కార్ఖానగడ్డ గాంధీరోడ్ ప్రాంతంలో బుధవారం అర్థరాత్రి 2:30 గంటలకు బర్త్‌డే వేడుకల సందర్భంగా యువకులు రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేశారని, వీంతో స్థానికుడు గంభీరావుపేట్ పృథ్వీరాజ్ వారించగా వెంటనే యువకులు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ కేసులో కార్ఖనగడ్డకు చెందిన దసనం సాయి భరద్వాజ్, బొబ్బటి భరత్‌కుమార్, పెపకాయల సాయి మురళి, జగిత్యాల దోబివాడకు చెందిన బండ వరుణ్, మండ వర్ధన్, గాంధీనగర్‌కు చెందిన బొల్లారపు అభి అలియాస్ భరత్‌లను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత

భగత్‌నగర్, ఫిబ్రవరి 8: బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆర్‌టీసీ అధికారులు ఆమెకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాకకు చెందిన ప్రయాణికురాలు భార్గవి ఈ నెల 7న ఆర్‌టీసీ బస్సులో బ్యాగు మర్చిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ జె గంగాధర్, కానిస్టేబుల్ ఎండి అఫ్రోజోద్దిన్ ఆ బ్యాగును గుర్తించి అధికారులకు అప్పగించారు. తన బ్యాగు పోయిన విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకురాగా పూర్తి వివరాలను తెలుసుకొని ఆమె బ్యాగును ఆమెకు అందచేశారు. బ్యాగులో రూ.35000లు రెండు వేల రూపాయల విలువైన బట్టలు అందులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎర్నింగ్ డీసీ ఐబి రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరాజం, కంట్రోలర్ కె రవిందర్, కంటక్టర్ జె గంగాధర్ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: కులం పేరుతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో గత 8 ఏళ్లుగా టీకొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని పేర్కొన్నారు. తన టీకొట్టు చుట్టూ రేకులు అమర్చుకోవడం కోసం బండరాళ్లను పేర్చుతుండగా ఇది మా స్థలం అంటూ నిందితులు బెదిరించారని తెలిపారు. అతనిపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాలని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

కత్తులతో విద్యార్థినులను బెదిరించిన యువకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8: ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యార్థినులను యువకులు కత్తులతో బెదిరించిన సంఘటన గురువారం కలకలం రేపింది. విద్యార్థినుల తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు భోజన సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ముగ్గురు యువకులు బైక్ వచ్చి కత్తులతో బెదిరించారు. విద్యార్థినుల అరుపులు విని సమీపంలో ఉన్న కాలనీవాసులు బయటకు వచ్చారు. ఈలోగా బైక్‌పై ఉన్న యువకులు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల సాయంతో యువకులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బీహార్ కూలీపై దాడి


కార్మికుడి ఒంటిపై గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని లొంకకేసారం సాయిబ్రిక్స్ (ఎస్ఏఐ) యాజమాని సోదరుడు ఒరిస్సా కూలీపై దాడి చేశాడు. ఇటుక బట్టీలో పనిచేసే బీహార్‌కు చెందిన చర్యా అనే కూలీపై సైండ్ల విష్ణు అనే యువకుడు గురువారం విచక్షణ రహితంగా కర్ర, చెప్పులతో దాడికి పాల్పడినట్లు కూలీ చర్యా పేర్కొన్నాడు. అర్ధరాత్రి వేళ కాలుతున్న బటీనుంచి ఇటుకలు లోడ్ చేయాలంటూ బెదిరింపులకు గురిచేశాడని తెలిపాడు. తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను తీసుకొని ఇష్టవచ్చినట్లు దూషించాడని కూలీ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు.

ఆవాల పరిశోధనాస్థానం ఏర్పాటయ్యేనా?

● మూడేళ్లుగా కాగితాలకే పరిమితం ● శాస్త్రవేత్తలు, నిధులు లేక అన్నదాతల్లో నిరుత్సాహం


జగిత్యాల పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం


జగిత్యాల జిల్లాలో సాగవుతున్న ఆవాల పంట

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం ఆశపడుతున్న ఆవాల రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మూడు సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాసలో ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ఒక వైపు శాస్త్రవేత్తలు లేక..మరో వైపు నిధులు రాక ఆవాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ పరిశోధనలకు కేంద్రమైన జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని చెప్పి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అతీ, గతీ లేకుండా పోయింది. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటికీ మంజూరు కాలేదు. నిధులు కానీ, శాస్త్రవేత్తలను కానీ నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధనా స్థానం అటకెక్కినట్లేనని రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఆవ సాగు ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగుచేస్తున్నారు. ఇక్కడి పొడి వాతావరణ పరిస్థితులు ఆవాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీనికి తోడు సాగుకు అవసరమైన ఎర్ర నేలలు ఉండడం కూడా ఆవాల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమవుతోంది. సాగునీటి వసతి ఉండడం, నాలుగైదు నీటి తడులు ఇస్తే సరిపోవడం, 80-90 రోజుల్లోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. పలు కంపెనీలు విత్తనోత్పత్తిని చేపట్టి, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తిలో సాగు చేస్తే క్వింటాలుకు రూ. 9 వేల వరకు ధర అందిస్తున్నారు. సాధారణ ఆవాలకు క్వింటాలుకు రూ.7-8 వేల వరకు ధర చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆవాల పంటకు అడవి పందులు, పక్షులు, కోతుల బెడద లేకపోవడం, పంట ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగుకు ముందుకు వస్తున్నారు. మంచి పంటవస్తే ఎకరాకు 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.50వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఫలితం కనబడటం లేదు.

నివేదికలకే పరిమితం

నాలుగేళ్ల క్రితం ఉత్తర తెలంగాణ (పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగుచేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి నివేదికలు పంపారు. ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సైతం సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సానుకూల నివేదికను పంపింది. కరోనా సమయంలో సంబంధిత ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. అనంతరం జరిగిన జాతీయ పరిశోధన మండలి సమావేశంలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలంగాణలోని పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని సూచించినా ఇప్పటివరకు ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

గతంలోనే నివేదికలు పంపాము

\- డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస



జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అదనంగా ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని గతంలోనే రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికను పంపాం. మండలి సైతం ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటుకు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణ ఆవాల రైతులకు మేలు జరుగనుంది.

కొండగట్టు హుండీ ఆదాయం రూ.83.91 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 8: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కింపు చేపట్టారు. 28 రోజులకు హుండీల ద్వారా రూ.83,91,502 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 32 గ్రాముల మిశ్రమ బంగారం, 4.500కిలోల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఎస్సై అశోక్, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి పాల్గొన్నారు. క్రితం సారి హుండీ లెక్కింపు సందర్భంగా సిబ్బంది సొమ్ములు తస్కరించిన నేపథ్యంలో మరోసారి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ బందోబస్తు పెంచారు.

విద్యుత్ స్టార్టర్ల దహనం


ధర్మారంలో దహనమైన విద్యుత్ స్టార్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావి మోటరు స్టార్టర్లను దహనం చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన గంగుల మహేష్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి రెండు మోటారు స్టార్టర్లను దహనం చేశారు. దీంతో ఆ రైతుకు పది వేల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపాడు.

వ్యక్తి దారుణ హత్య

● పాత కక్షలతోనే అని అనుమానాలు


వెంకటరమణ(ఫైల్)

కోరుట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి హత్య ఘటన సంచలనం రేపింది. ద్విచక్రవాహనంపై వెలుతున్న వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే పాత కక్షలే హత్యకు కారణమని తెలుస్తోంది. కాలనీ వాసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్డుకు చెందిన అనుమాల్ల వెంకటరమణ (55) పట్టణంలో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వెంకటరమణ పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ ఇంటిని గెస్టు హౌస్‌గా ఏర్పరుచుకుని అక్కడి నుంచి వడ్డీ వ్యాపారంతో పాటు ప్రైవేట్ చిట్టీలను నడిపిస్తుండేవాడు. అదే కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ మధ్య ఓ విషయంలో మనస్పర్థలు రావడటంతో గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగి రాజీపడ్డారు. రఘు కొన్ని రోజులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రఘు తన కాలనీ ప్రాంతంలోనే గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెంకటరమణ రఘు మధ్య మరోమారు గొడవలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం యధావిధిగా వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై తన గెస్ట్ హౌస్‌కు వెలుతుండగా మాటు వేసిన రఘు వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వెంకటరమణ పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయాడు. అప్పటికీ ఆగకుండా రఘు తన వద్ద ఉన్న కత్తితో మళ్లీ దాడి చేయడంతో వెంకటరమణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రాత్రి సమయంలో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

నష్టపరిహారం ఇచ్చి భవనాలను నిర్మించాలి

● మెడికల్ కళాశాల నిర్మాణ పనులు అడ్డుకున్న రైతులు


పనులు అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : మా భూములకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాత మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించుకోవాలంటూ గురువారం నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు తీసుకుని భవనం నిర్మించారు. మిగిలిన భూముల్లో తిరిగి అదనపు భవనాలను నిర్మించేందుకు బుధవారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్‌లను రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. గురువారం కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ఈఈ రవీందర్‌లు పెద్దూర్‌కు చెరుకుని ఎక్స్‌కావేటర్‌లతో భూములుల్లో పనులను చేపట్టగా ఈ విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్‌తోపాటు రైతులు అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆందోళన చేయడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా రైతులు మాత్రం మా భూములకు నష్టపరిహారం అందించిన తరువాతనే భవనాలను నిర్మించాలని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 408సర్వేనంబర్‌లో ఉన్న భూములను జీవనోపాధికోసం అందించగా వాటిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా గత రెండు సంవత్సరాల క్రితం మా భూములను చదును చేసి 36 ఎకరాలల్లో మెడికల్ కళాశాల నిర్మాణాలను చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదన్నారు. దీంతో మిగతా భూములను ఇవ్వవద్దని నిర్ణయించుకున్నామని తీసుకున్న భూములతో పాటు భూములకు నష్టపరిహారం అందిస్తేనే పనులు చేయిస్తామని లేకుంటే అడ్డుకుని అందోళనలు చేయడంతో పాటు నిరాహార దీక్ష చేపడుతామన్నారు. నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగంపల్లి అశోక్, నాగుల రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, గుగ్గిళ్ల అంజవ్వ, లింగంపల్లి రాజవ్వ, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గేట్‌వాల్వులు ధ్వంసం.. వృథాగా సాగునీరు


గోపాల్‌రావు పేట వద్ద వృథాగా పోతున్న నీరు

రామడుగు, ఫిబ్రవరి 8: అధికారుల అనుమతి లేకున్నా కొంతమంది ఎల్లంపల్లి పైపులైన్ గేట్ వాల్వులను ధ్వంసం చేయగా వృథాగా పంట పొలాల్లోకి నీరు రావడంతో పంటపొలాలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట, గుండి గ్రామాల మీదుగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి బెల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా నీరు వెళ్తుంది. అయితే వారం క్రితం ఎల్లంపల్లి నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా ఎల్లంపల్లి పైప్‌లైన్‌కు గోపాల్‌రావుపేట, గుండి గ్రామాలలో సుమారు రెండు మూడు కిలోమీటర్లకు మూడు నుంచి నాలుగు గేట్ వాల్‌లను అమర్చారు. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది గోపాల్‌రావుపేటకు సమీపంలోని ఎల్లంపల్లి పైప్‌లైన్ మీద ఉన్న రెండు గేట్‌వాల్ ధ్వంసం చేయడంతో నీరంతా పైకి లేచింది. దీంతో దేశాయిపేట చెరువులోకి నీరు వెళ్లేందుకు ఏకంగా జేసీబీతో పైప్‌లైన్‌పై కాలువ తీసి గోపాల్‌రావుపేట రైతుల అనుమతి లేకుండా అక్రమంగా కాలువను తీశారని రైతులు వాపోతున్నారు. గేట్‌వాల్‌ల నుంచి వచ్చే నీరంతా రైతుల పంటపొలాల్లోకి వెళ్లడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవల్లి రామచంద్రారెడ్డి అనే రైతు పొలంలో తన అనుమతి లేకుండానే జేసీబీతో కాలువను తవ్వి నీటిని చెరువులోకి తరలిస్తున్నారని అన్నారు. గేట్‌వాల్‌ను ధ్వంసం చేసి అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేములవాడలో ఘనంగా మహాలింగార్చన


మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 8 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి గురువారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం వేళలో స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో జ్యోతులు వెలిగించి పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి8: మండలంలోని గంగారం గ్రామంలో పోలిసులు పెట్రోలింగ్ చేస్తుండగా 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం అక్రమంగా టాటా ఏఎస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి నేరుగా విక్రయించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. గంగారం గ్రామంలో నరహరి శంకర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్‌కు అప్పగించినట్టు తెలిపారు.

ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినా నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

సభలో ఉమ్మడి జిల్లా నేతలు



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సీఎంకు స్వాగతం పలుకుతున్న శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




సమావేశాలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రమణ, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, విజయరమణారావు

చేనేత హస్తకళా మేళాకు విశేష ఆదరణ



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: జిల్లా కేంద్రంలోని కోర్టు సమీపంలోని శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపంలో జనవరి 20 నుంచి ఫిబ్రవరి 18 వరకు నిర్వహిస్తున్న అఖిల భారత హస్తకళా, చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ మేళాలో పోచంపల్లి, బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, కళంకారి, మంగళగిరి చేనేతలు, వరంగల్ టవల్స్ లుంగీలు, పొందూరు చేబ్రవోలు ఖాదీ వస్త్రాలు, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరలు, జైపూర్ బెడ్ షీట్స్, టాప్స్ స్కర్ఫ్స్, తమిళనాడు చెట్టినాడు చీరలు, హైదరాబాద్ బంజారా ఉత్పత్తులు, గుజరాత్ టాప్స్, స్కర్ఫ్స్, నారాయణపేట, గద్వాల, ఉప్పాడ శారీస్, హర్యానా సోఫా కట్ వర్క్స్, దివాన్ సెట్స్, చిన్నారుల డ్రెస్సులు, నైటీలు సరసమైన ధరలకు విక్రయిస్తున్నామని మేళా నిర్వాహకుడు కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటలకు హస్తకళా మేళా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

-మేయర్ యాదగిరి సునీల్‌రావు



జర్నలిస్టు కాలనీని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: జర్నలిస్టుల కాలనీలో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు హామీ ఇచ్చారు. గురువారం ఐటీ టవర్ పక్కన గతంలో జర్నలిస్టులకు కేటాయించిన నివేశన స్థలాన్ని ఆయన సందర్శించారు. జర్నలిస్టుల నివేశన స్థలాల కాలనీలో నగరపాలక సంస్థ ద్వారా మౌలిక సదుపాయాలను కల్పించాలని జర్నలిస్టు యూనియన్ ప్రతినిధి నగునూరి శేఖర్ మేయర్‌ను కోరడంతో ఆయన అధికారులు, స్థానిక కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్‌తో కలిసి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ కాలనీలో డ్రైన్ టు డ్రైన్ రోడ్లు, మంచినీటి వసతి, వీధిదీపాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు వాల రమణారావు, ఎడ్ల సరిత అశోక్, సల్ల శారద రవీందర్, జర్నలిస్టు యూనియన్ ప్రతినిధి ఎలగందుల రవీందర్, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మానేరు విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మానేరు చైర్మన్ అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి8: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించినట్లు పాఠశాల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. కటాస్ విభాగంలో పోటీపడిన ఆహిల్ బంగారు పతకం, షాస్మీన్ రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను మానేరు అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి అభినందించారు.

హెల్త్ డైరెక్టర్ రవీందర్‌ను కలిసిన నాయకులు

జమ్మికుంట, ఫిబ్రవరి 8: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారిగా నియామకం అయిన డాక్టర్ బి రవీందర్ నాయక్‌ను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బ్లాక్-బి అధ్యక్షులు మొలుగూరి సదయ్య మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. శాల్వ కప్పి మొక్క అందజేశారు. హుజూరాబాద్ నియోజక వర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వ్యాధులకు మెరుగైన సేవలు అందే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం



వాగోడ్డు రామన్నపల్లిలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 8: ఇల్లందకుంట మండలంలోని వాగోడ్డు రామన్నపల్లె గ్రామంలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో చలో అభియాన్ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, మహిళా సాధికారత అంతర్గత బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ, విదేశాల్లో భారతదేశ గౌరవాన్ని పెంచడం వంటి అనేక రంగాలలో ప్రధాని మోదీ గురించి వివరించారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షుడిగా పుట్ట శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అరెల్లి శ్రీనివాస్, మడ్డి శ్రీనివాస్, కందాల రాజేందర్, రమేష్, భద్రయ్య, సాంబయ్య, సునీల్, అనిల్, శ్రీకాంత్, లింగయ్య, వంశీ, సాంబయ్య, రాజేష్, రాజు, అనిల్, రాజయ్య,రాకేష్, శ్రీనివాస్, వీరస్వామి, రాజు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు

చిగురుమామిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నర్సయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలన్నారు.

వికలాంగ పింఛన్ కోసం ఎదురుచూపులు

చిగురుమామిడి,ఫిబ్రవరి8: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అన్నాడి మల్లవ్వ(50) అనే మహిళ మూడేళ్లుగా వికలాంగుల పింఛన్ కోసం ఎదురు చూస్తోంది. మల్లవ్వకు నాలుగు సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చి కాళ్లు, చేతులు పడిపోయాయి. పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా మంజూరు కావడం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కూడా వినతిపత్రం సమర్పించారు. మంత్రి స్పందించి పింఛన్ ఇప్పించేలా చూడాలని వేడుకొంటోంది.



బాధితురాలు మల్లవ్వ

భూకబ్జాదారులు ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దు

-గత ప్రభుత్వ అవినీతిపై ఆధారాలతో ఫిర్యాదు చేశాం -కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి8: భూకబ్జాదారులు ఎంతటివారైనా వదలద్దని, బాధితులకు న్యాయం చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూకబ్జా కోరులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపితే గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన భూకబ్జా కోరులు ఒక్కొక్కరుగా జైలుకు వెళ్తున్నారని అన్నారు. ఈ భూకబ్జాదారుల్లో అసలైన ఏ1, ఏ2, ఏ3లకు కూడా శిక్ష పడాల్సిన అవసరం ఉందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టా రాజ్యాంగ వ్యవహరించడంతోనే అవినీతి, భూకబ్జాలు విచ్చలవిడిగా జరిగాయని అన్నారు. కబ్జాకోరుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్కరో ఇద్దరో ఒకవేళ ఉన్నా వదిలి పెట్టవద్దని నరేందర్‌రెడ్డి కోరారు. ప్రజలు అవకాశం ఇచ్చినా బండి సంజయ్ కుమార్, వినోద్ కుమార్‌లు అభివృద్ధి చేయలేని అసమర్థ నాయకులుగా మిగిలిపోయారన్నారు. మూడో స్థానానికి ఈ ఇద్దరూ పోటీ పడుతున్నారని, వీరు ఏముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నిం చారు. నాణ్యతాలోపంతో చెక్ డ్యాంలు కొట్టుకుపోయి రెండున్నర కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. కొట్టుకపోయిన చెక్‌డ్యాం స్థలంలోనే మానేర్ రివర్ ఫ్రంట్ బ్యారేజ్ కట్టారని ఆరోపించారు. కొట్టుకుపోయిన రెండున్నర కోట్ల చెక్ డ్యాం నష్టం రికవరీ కోసం ఫిర్యాదు చేశామని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కుంగిన దానిపై, స్మార్ట్ సిటీ పనులపై, కూడళ్ల సుందరీకరణ పనుల రెట్టింపు అంచనాపై విచారణ జరిపించాలని సంబంధిత మంత్రులకు ఫిర్యాదు చేశా మని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు తాజొద్దిన్, కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్,దండి రవీందర్, అఖిల్, దన్నసింగ్, కామిరెడ్డి రాంరెడ్డి, జీడి రమేష్, చాంద్, మెరాజ్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, ముక్క భాస్కర్, పెద్దిగారి తిరుపతి, కాంతయ్య, బషీర్, మహమ్మద్ భారీ, షేహెన్న, అస్తపురం రమేష్, నెల్లి నరేష్ పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులను పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో ప్రారంభించి అసంపూర్తిగా వదిలిన అభివృద్ధి పనులన్నిటిని వెంటనే పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో నిరసన దర్నా చేపట్టారు. ఈసందర్భంగా పార్లమెంట్ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి, ఆగయ్య మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్దికోసం 58,59,60,55 డివిజన్లలో స్మార్ట్‌సిటీ పనులను ప్రారంభించి నాలుగైదునెలలు గడుస్తున్నా పూర్తి చేయకుండా వదిలి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందబోయిన రాజేశం, నాగుల బాలగౌడ్, తీగుట్ల రమేశ్, ఏర్రోజు హైగ్రీవాచారి, సాయి రాజమల్లయ్య, లంక భాస్కర్, ఎర్రవెల్లి రవీందర్, బసాలత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ గ్రాండ్ ఫినాలేకు శుభశ్రీసాహు ఎంపిక

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: స్థానిక పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శుభశ్రీ సాహు తన శాస్త్రీయ ఆవిష్కరణలకు వివో ఇగ్నైట్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ గ్రాండ్ ఫినాలేకు ఎంపికైంది. దేశవ్యాప్తంగా 20వేల మంది విద్యార్థులు మొదటి దశలో పాల్గొనగా వారిలో 200 మందిని రెండో దశకు ఎంపిక చేశారు. అనంతరం వీరిలో నుంచి 10 ఉత్తమ ఆలోచనలను ఎంపికచేశారని వారిలో శుభశ్రీసాహూ ఎంపిక చేయబడ్డారని పాఠశాల హెచ్‌ఎం రితేష్ మెహతా తెలిపారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు శుభశ్రీని అభినందించగా డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వియుఎం.ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రోగ్రాంహెడ్ గోపికృష్ణ, గైడ్ టీచర్ లలిత్ మోహన్‌సాహులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ పనులపై విచారణ జరిపించాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పేరిట 130 కోట్ల రూపాయలకుపైగా అవినీతి జరిగిందని దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. స్మార్ట్‌సిటీ దోపిడీలో స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కొంతమంది కార్పొరేటర్లు బాధ్యులని వారిపై విచారణ జరిపితే చాలా మంది బయటకు వస్తారని ఆరోపించారు. నగరంలో కార్పొరేటర్లు చేసిన భూ ఆక్రమణలపై విచారణ జరుగుతున్న తీరు అభినందనీయని, సీపీ అభిషేక్ మొహంతి అవినీతి పరులను జైలుకు పంపడంతో వారి గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయని పేర్కొన్నారు. నగరంలో గత పది సంవత్సరాలుగా స్మార్ట్‌సిటీ పేరిట చేపట్టిన పనుల్లో నాణ్యత లేదని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. తీగల వంతెన నిర్మాణంలో ఎస్టీమేషన్ కంటే ఎక్కువ బిల్లులు తీసుకున్నారని వాటిపై విచారణ చేపట్టాలని కోరారు. బీఆర్‌ఎస్ పాలనలో బియ్యం అక్రమ రవాణా జరిగిందని ఆరోపించారు. అసైన్డ్, సీలింగ్, ఎస్‌ఆర్‌ఎస్‌పీ, శిఖం, ప్రభుత్వ, ప్రైవేటు భూము లన్నింటిని నియోజక వర్గంలో లేకుండా బీఆర్‌ఎస్ నాయకులు చేశారని, వారందరిని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి దోపిడి సొమ్మును కక్కించాలని ఆయన కోరారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీట్‌బెల్ట్, హెల్మెట్ ధారణతో సురక్షితమైన ప్రయాణం ఏవిధంగా ఉంటుందని ఈసందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం, అతివేగం, సెల్‌ఫోన్ రైడ్‌లతో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయనేది వివరించారు. పాఠశాల విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు పర్శ రమేష్, కరీముల్లాఖాన్, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు అబాకస్ దోహదం



విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మేయర్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు అబాకస్ దోహదం చేస్తుందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గణితంపై ఉండే భయం వీడి విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విశ్వం స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ సాధారణంగా ఎక్కువ మంది విద్యా ర్థులకు గణితం అంటే భయం ఉంటుందని, అబాకస్ నేర్చు కోవడంతో ఆ భయం పోతుందని అన్నారు. అంతేకాకుండా సులువైన పద్ధతులను ఎలా అవలంబించి గణితం సమస్యలను పూర్తి చేయవచ్చని ఈ అబాకస్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. దీనితో విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి సులువైన పద్ధతులు విద్యలో నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. అబాకస్ మ్యాథ్స్ మానసిక ఒత్తిడిని కూడా తగ్గిస్తుందని సూచించారు. ఈ పోటీలకు జిల్లాలోని 50 పాఠశాలల నుంచి దాదాపు 400మంది విద్యా ర్థులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 30మందికి ప్రశంసా పత్రాలను మేయర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈకార్య క్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, ట్రస్మా చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు, విశ్వం స్కూల్ రీజినల్ మేనేజర్ వినాయక్, జోనల్ మేనేజర్ మారుతి, విశ్వం టీం సభ్యులు స్రవంతి, లక్ష్మీనారాయణ, సాగర్, శివ, నిశ్చల పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్న అధికారులు

● పాత బకాయిలు మాఫీ చేయడంతో గంగాధర జీపీ ఆదాయానికి గండి

గంగాధర, ఫిబ్రవరి 8: గ్రామపంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారు. కాంట్రాక్టర్లు జీపీ వారసంతకు పాడిన వేలం పాటలో దక్కించుకున్న ఆదాయాన్ని కారణాలు చూపుతూ తీర్మాణాలు చేసి మాఫీ చేయడంతో భారీ మొత్తంలో పంచాయతీకి రావాల్సిన నిధులు నిలిచిపోతున్నాయి.

గంగాధర గ్రామపంచాయతీకి వారసంత ద్వారా ఏటా కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. గంగాధర వారసంత వేలంలో గ్రామస్థులే ఎక్కువ మార్లు వేలం దక్కించుకున్నారు. వేలం పాటలో సంతను దక్కించుకున్న వారు వివిధ కిస్తీల రూపంలో డబ్బులు చెల్లించేందుకు ఒప్పందం కదుర్చుకుని పంచాయతీకి వారి పేరున ఉన్న వ్యవసాయ భూమిని మార్టిగేజ్ చేస్తారు. పాలకవర్గం ఏర్పడిన తరువాత కరోనా సమయంలో 2018-19 సంవత్సరానికి రూ. 85.3లక్షల వేలం పాట పాడిన కాంట్రాక్టర్ నోట్ల రద్దుతో లాస్ పేరుతో రూ.74లక్షలు పంచాయతీలో జమచేయగా రూ.11 లక్షలు పాలకవర్గం మాఫీ చేసింది. 2020-21 సంవత్సరానికి ఎవరూ వేలంపాటలో ముందుకురాకపోవడంతో గ్రామపంచాయతీ నడిపించి వారసంత ఊపందుకోవడంతో 52 వారాలకు వేయాల్సిన వేలం 38వారాలకు వేలం వేశారు. రూ. 78లక్షలు టెండరు దక్కించుకొని కాంట్రాక్టర్ 4.94లక్షలు బాకీ ఉన్నాడు. ఇతను కరోనా సోకి మృతి చెందగా అతని కుమారుడు లాస్‌లో ఉన్నామని అర్జీ పెట్టుకోగా 3లక్షలు కట్టించారు. అదే 2021-22 సంవత్సరానికి కోటి 36లక్షలు వేలం పాట దక్కించుకున్న కాంట్రాక్టర్ 80.86లక్షలు చెల్లించగా లాస్‌లో ఉందని వివిధ కారణాలు చూపగా 15.94లక్షలు కట్టించుకుని రూ.36లక్షలు మాఫీ చేశారు. గత ఏడాది కోటి 36లక్షలు వేలం పాట దక్కించుకోగా మూడు మార్లు వేలం పాటలో తక్కువగా పడటంతో 22-23 సంవత్సరానికి పంచాయతీ సిబ్బంది చిట్టీలు చింపగా కేవలం రూ. 74 లక్షలు జమైంది. మొత్తం మూడేళ్లలో 11లక్షలు, 1.94లక్షలు, 39.23 లక్షల రూపాయలు మాఫీ చేయగా పంచాయతీ ఆదాయం 52.17 లక్షలు గండిపడిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 8: ఈ నెల 9వ తేదీన మానకొండూర్ మండలం చెంజర్లలోని విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు మండలంలోని అలుగునూర్ సబ్‌స్టేషన్ ఏఈ వెంకటరమణ తెలిపారు. దీనికి టీఎస్ఎన్‌పిడిసిఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్ పర్సన్ కె.తిర్మల్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టులో విద్యుత్ సమస్యలు, విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకానికన్నా హెచ్చు మొత్తంలో గల బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు తదితర వాటికి సంబంధించి విద్యుత్ వినియోగదారులు హాజరై రాత పూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఈ ఫిర్యాదులు ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాపాలన సర్వేను పరిశీలించిన డీపీవో

తిమ్మాపూర్, ఫిబ్రవరి8: తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజాపాలనలో భాగంగా అందిన దరఖాస్తులకు సంబంధించి ఆరు గ్యారంటీలలో భాగంగా గ్యాస్‌కు సంబంధించి లబ్ధిదారుల సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న సభ్యులతో ఆయన సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడివో రవీందర్ రెడ్డి, ఎంపివో కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రావు, సర్వే సభ్యులు శారద, రజిత, అనిత, శకుంతల తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో సర్వే టీం సభ్యులతో మాట్లాడుతున్న డిపివో వీర బుచ్చయ్య

రోడ్డు నిర్మించారు.. డ్రైనేజీని విస్మరించారు

మానకొండూర్, ఫిబ్రవరి 8: మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని అన్నారం గ్రామంలో తారు రోడ్డు నిర్మించి మురికి కాల్వ నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డు కంటే సుమారు మీటరు వరకు ఎత్తు పెంచి తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామంలో సగం వరకు మురికి కాల్వ నిర్మాణం చేపట్టి మరో సగం వరకు నిర్మాణం చేపట్టకుండానే వదిలేశారు. దీంతో గతంలో ఉన్న మురికి కాల్వ కిందికి కావడంతో ఇళ్ల నుంచి నీరు పాత కాలువలో చేరి ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మురికి నీరు బయటికి వెళ్లకపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో రోడ్డుకిరువైపులా పూర్తి స్థాయిలో మురికి కాల్వను నిర్మించి దోమలు, దుర్వాసన నుంచి కాపాడాలని ప్రజాప్రతిధులు, అధికారులను కోరుతున్నారు.



బయటకి వెళ్లే పరిస్థితి లేక డ్రైనేజీలో నిలిచిన నీరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి9: నగరంలో శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 10:30 వరకు సాయంత్రం 4గంటల నుంచి 4:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. భగత్‌నగర్ ఏరియా, శివాలయం ఏరియా, పెద్దమ్మగుడి ఏరియా, వెంకటేశ్వర కాలనీ, విగ్నేశ్వరకాలనీ, ఫకీరువాడ, ఎర్రగుట్ట కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

బీజేపీకి పద్మారెడ్డి రాజీనామా

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8: భారతీయ జనతా పార్టీకి ఆ పార్టీ మహిళా నాయకురాలు గుర్రం పద్మారెడ్డి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. పార్టీలో ద్వితీయశ్రేణి, దిగువశ్రేణి నాయకులకు, కార్యకర్తలకు ఏమాత్రం గుర్తింపులేదని, కేవలం ఎన్నికల్లో ప్రచారానికి ఉపయోగపడేవారిగానే చూస్తున్నారు తప్ప ఎవరికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. అందుకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని, కాంగ్రెస్ పార్టీలో చేరనున్నానని ప్రకటించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్‌లోని 1వ డివిజన్‌లో గల తీగలగుట్టపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీగలగుట్టపల్లి గ్రామం కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనమై నాలుగు సంవత్సరాలైనా ఇంతవరకు డివిజన్ ప్రజలకు తాగునీటి సమస్య అందలేదన్నారు. ముఖ్యంగా సరస్వతినగర్‌లో తాగునీటి సమస్య ఉందన్నారు. నాలుగు సంవత్సరాలుగా వేసవికాలంలో తన స్వంత డబ్బుతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. డివిజన్‌లో మంచినీటి పైపులైను పనులు ఇంకా పూర్తికాలేదని తెలిపారు. వెంటనే పైపులైను పనులను పూర్తి చేసి తాగునీటిని అందించాలని కోరారు.

ఆలయాల్లో టెండర్ల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 8: దేవాదాయశాఖ పరిధిలోని పాతబజార్ గౌరీశంకరస్వామి దేవాలయంలో టెంకాయలు, పూజా సామాగ్రి అమ్మకాల హక్కు కోసం టెండర్ల ఆహ్వానం కోసం ఏసి కార్యాలయం ద్వారా అనుమతి పొందినట్లు ఈఓ వుడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు ఆలయంలో సంప్రదించి ఈ నెల 12న ఉదయం 10-30 గంటలకు ఆలయ కార్యాలయంలో జరిగే వేలములో పాల్గొనాలని కోరారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని దేవాదాయశాఖ పరిధిలో గల సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో టెంకాయల అమ్మకం, కొబ్బరి ముక్కల ప్రోగు, ఫోటోలు, భక్తి క్యాసెట్లు, పూల దండల అమ్మకాల హక్కు కోసం టెండర్లను ఆహ్వానించేందుకు ఏసి కార్యాలయం ద్వారా అనుమతి పొందినట్లు ఈఓ ఎండపెల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆలయంలో 14వ తేదీ లోపు సంప్రదించి, 16న ఉదయం 11 గంటలకు ఆలయ కార్యాలయంలో జరిగే వేలములో పాల్గొనాలని కోరారు.

అయోధ్యకు తరలిన బీజేపీ శ్రేణులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి8: అయోధ్యలో కొలువుదీరిన శ్రీబాలరాముడి దర్శనం కోసం జిల్లా బీజేపీ శ్రేణులు అయోధ్యకు వెళ్లారు. గురువారం కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేక రైలులో అయోధ్యకు వెళ్తున్న పార్టీశ్రేణులకు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు పుప్పాల రఘు, గౌతమ్‌రెడ్డి, సంతోష్, కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు రుణాలు అందజేస్తాం



మర మగ్గాలను పరిశీలిస్తున్న చేనేత డైరెక్టర్ అలుగు వర్షిణి, కలెక్టర్ పమేలా సత్పతి

వీణవంక ఫిబ్రవరి8: చేనేత కార్మికులకు త్వరలోనే రుణాలు అందిస్తామని చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి అన్నారు. మండలంలోని కొర్కల్ దేశాయిపల్లిలో చేనేత మగ్గాలను పరిశీలించారు. చేనేత కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు రోగులకు అందిస్తున్న సదుపాయలు అడిగి తెలుసుకున్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

మానకొండూర్, ఫిబ్రవరి 8: తప్పుడు కులధ్రువీకరణ పత్రాలతో ఎన్నిక అయిన మానకొండూర్ ఎంపీపీపై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజు గంగారాం అహిర్‌కు గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సమన్వయకర్త సంజయ్‌కుమార్ వినతిపత్రం సమర్పించారు.

ఉచిత వైద్య శిబిరం

హుజూరాబాద్, ఫిబ్రవరి 8: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం కూరపాటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతి

గంగాధర, ఫిబ్రవరి 8: ఆచంపల్లికి చెందిన మాజీ ఎంపీపీ గంగాధర శంకర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండురోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కరీంనగర్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని ఆచంపల్లికి చెందిన గంగాధర ఆచంపల్లి సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా, సింగిల్ విండో అధ్యక్షుడిగా పదవులు దక్కించుకున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చొప్పదండి, ఫిబ్రవరి 8: చొప్పదండి పట్టణంలోని ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని గురువారం తనిఖీ చేశారు. మందుల దుకాణాలకు సంబంధించిన విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ ఉన్నారు

సన్మానం

జమ్మికుంట, ఫిబ్రవరి 8: జమ్మికుంట పట్టణానికి చెందిన సాయిని రవిని హుజూరాబాద్ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా నియమించడం పట్ల నియోజక వర్గ ఉపాధ్యాయులు తేలుకుంట్ల ప్రశాంత్ గురువారం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.